సాక్షి శ్రీకాకుళం

సోమవారం, 1, ఏప్రిల్, 2024



దొరికిపోయారు..

శ్రీకాకుళంలో వృద్ధురాలి బంగారం దోచుకున్న దొంగలు దొరికారు. బంగారాన్ని కూడా పోలీసులు రికవరీ చేశారు. - 8లో



శరవేగంగా పనులు

కేఆర్ స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ పనులు వేగంగా జరుగుతున్నాయి. రెండు ట్రాక్‌లు వేస్తున్నారు. - 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
సోమ	మంగళ
సాయంత్రం	ఉదయం
6.11	4.34

న్యూస్‌రీల్

ముగిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ

శ్రీకాకుళం పాతబస్టాండ్: గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ ముగిసింది. ఈ ఏడాది రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేశారు. ఈ ఏడాది జిల్లాలో 1,54,798 మంది రైతుల నుంచి 4,49,181 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి, వాటికి గాను రూ. 980.56 కోట్లు వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. ఇందులో జీఎల్‌టీ ఖర్చులు రూ.26.17 కోట్లు కాగా వాటిలో రూ.24.66 కోట్లు రైతుల ఖాతాల్లో వేశారు. ఇందులో రవాణా, ఇతర ఖర్చులు ఉన్నాయి. ఈ వారంలో కొనుగోలు చేసి ధాన్యం నగదు మినహా రైతులకు చెల్లించాల్సిన పూర్తి ధాన్యం నగదుని ప్రభుత్వం సివిల్ సప్లై కార్పొరేషన్ ద్వారా చెల్లించారు.

వలంటీర్ ఉద్యోగాలకు మూకుమ్మడి రాజీనామాలు



రాజీనామా పత్రాలను చూపిస్తున్న బొడ్డపాడు గ్రామ వలంటీర్లు

పలాస: పలాస మండలం బొడ్డపాడు పంచాయతీలో ఉన్న గ్రామ వలంటీర్లు ఆదివారం మూకుమ్మడిగా రాజీనామా చేశారు. ఈ మేరకు వారు రాజీనామా పత్రాలను చూపిస్తూ సోమవారం పలాస ఎంపీడీఓ మెట్ట వైకుంఠరావుకు అందజేస్తున్నామని చెప్పారు. వైఎస్ జగన్ మళ్లీ సీఎం అయ్యేందుకు తామంతా కృషి చేస్తామన్నారు. జగనన్న సైనికులుగా పనిచేస్తామని చెప్పారు.

9న ఉగాది కవి సమ్మేళనం

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు రచయితల వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9న సాయంత్రం 4.30 గంటలకు ఉగాది కవి సమ్మేళన హోటల్ గ్రాండ్‌లో నిర్వహిస్తున్నట్లు వేదిక అధ్యక్ష, కార్యదర్శిలు ఉత్తరావల్లి నాగేశ్వరరావు, ఆర్‌వీ రమణమూర్తిలు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా 'ఉత్తరావల్లి ఊసులు' పుస్తకావిష్కరణ, కవులకు సత్కారాలు ఉంటాయని తెలిపారు. ఉగాది–ఉషస్సు అనే అంశంపై తెలుగుదనం ఉట్టి పడేటట్లు కవిత రాసి, చదవడానికి ఉత్సాహం ఉన్నవారు ఉమాకవి చరవాణి 9491325714 నంబరుకు వాట్సాప్ ద్వారా పాల్గొనే కవులు ఈ నెల 6లోపు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అచ్చెన్నాయుడుకు మాతృవియోగం



కళావతమ్మ (ఫైల్)

కోటబొమ్మాళి: తెలుగు దేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు తల్లి కళావతమ్మ(95) ఆదివారం సాయంత్రం కన్నుమూశారు. గత కొద్ది రోజులుగా వృద్ధాప్య, అనారోగ్య కారణాలతో బాధపడుతున్న కళావతమ్మ కోట బొమ్మాళి మండలంలోని ఆమె స్వగ్రామం నిమ్మాడలో మృతి చెందారు. కళావతమ్మకు నలుగురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. కళావతమ్మ మృతిపై పలువురు ప్రముఖులు సంతాపం తెలిపారు.

పింఛన్ల పంపిణీకి నిబంధనలు



శ్రీకాకుళం పాతబస్టాండ్: ప్రస్తుతం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున పెన్షన్ పంపిణీకి అధికారులు కొన్ని సూచనలు జారీ చేశారు. దీని ప్రకారం ఎన్నికల కోడ్ ఉన్నంత వరకు పింఛన్ల పంపిణీలో కొన్ని నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలులో ఉన్నందున వలంటీర్ల ద్వారా పెన్షన్ పంపిణీ చేయరు. అలాగే ఇంటింటికీ పంపిణీ కూడా జరగదు. సచివాలయ ఉద్యోగులు సచివాలయం వద్ద మాత్రమే పింఛన్లు అందజేస్తారు. పెన్షన్‌దారులు పింఛన్ కోసం ఆధార్ లేదా ఇతర గుర్తింపు కార్డు తీసుకువస్తే సరిపోతుంది. పెన్షన్ పాస్‌బుక్ తీసుకురాకూడదు. ఇందులో ముఖ్యమంత్రి, ఇతర రాజకీయ నాయకుల చిత్రాలు ఉంటాయి కాబట్టి తీసుకురాకూడదని పేర్కొన్నారు. వలంటీర్ల వద్ద ఉన్న మొబైల్, బయోమెట్రిక్ పరికరం జిల్లా ఎన్నికల అధికారికి హ్యాండోవర్ చేయాల్సి ఉన్నందున బయోమెట్రిక్ పరికరాలు ఎన్ని అవసరమవుతాయో అన్ని సచివాలయంలో ఉంచుకుని మిగిలినవి హ్యాండోవర్ చేయాలి. ఎంపీడీఓలు, పంచాయతీ సెక్రటరీ, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఆథరైజేషన్ లెటర్ తమ లాగిన్‌లో జనరేట్ చేసి అందజేయాలి. బ్యాంకు నుంచి నగదు విత్ డ్రా చేసేవారు ఈ ఆథరైజేషన్ లెటర్ ఒరిజినల్ కాపీ దగ్గర ఉంచుకోవాలి. సచివాలయ సిబ్బంది అందరికీ లాగిన్ ఇస్తారు. క్లస్టర్ మ్యాపింగ్‌లు ఉండవు.

నిస్సహాయులపై క్షుద్ర రాజకీయం



ఒకటో తేదీ వచ్చిందని ఇంటి గడపలో కూర్చుని ఎదురుచూసే వృద్ధులు, దివ్యాంగులకు ఈ నెల వలంటీర్ కనిపించడు. కాళ్లు కదపలేని దివ్యాంగులు, కాసింత దూరం కూడా నడిచి వెళ్లలేని వృద్ధులు ప్రభుత్వ కార్యాలయానికి వెళ్లక తప్పదు. తమ వంతు వచ్చే వరకు నిరీక్షించక తప్పదు. ప్రతి నెలా తలుపు తట్టి పింఛన్ అందించే ఆత్మీయుడు ఆ పని చేయకూడదని 'కొందరు' ఫిర్యాదు చేశారు. దేశానికే ఆదర్శంగా నిలిచిన వలంటీర్ వ్యవస్థపై కక్ష పెంచుకున్న విపక్షాల అజెండాను భుజానికెత్తుకుని ఈ కుట్రకు పూనారు. దీనిపై ప్రజా ప్రతినిధులు దుమ్మెత్తిపోశారు. మీడియా సమావేశాలు నిర్వహించి విపక్షాల తీరును దునుమాడారు. నిస్సహాయులకు సాయం అందకుండా క్షుద్ర రాజకీయం చేశారని మండిపడ్డారు.

- కాశీబుగ్గ, టెక్కలి, నరసన్నపేట, రణస్థలం, ఆమదాలవలస

నిర్ణయాన్ని పున:సమీక్షించాలి



ఎన్నికల సంఘం వలంటీర్లపై తీసుకున్న నిర్ణయాన్ని పున:సమీక్షించాలి. పేదలకు సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష పార్టీలు అనైతిక చర్యలకు పాల్పడ్డాయి. ఒక స్వచ్ఛంద సంస్థ పేరుతో వలంటీర్లను వారు నిర్వహిస్తున్న విధులకు దూరంగా ఉంచేలా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయటం ప్రతిపక్ష పార్టీల కుట్రపూరితమైన ఆలోచన. వికలాంగులు, వృద్ధులకు అందాల్సిన ప్రభుత్వం పథకాలు నిలిచిపోయే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వ హయాంలో పింఛన్ తీసుకోవడానికి నానా ఇబ్బందులు పడేవారు. మళ్లీ ఆ రోజులు రాకూడదు. వలంటీర్ వ్యవస్థపై దేశ వ్యాప్తంగా అధ్యయనం జరుగుతున్న తీరును ప్రతిపక్షాలు తెలుసుకోవాలి.

- తమ్మినేని సీతారాం, స్పీకర్

ఉసురు తగిలి తీరుతుంది



వలంటీర్లు పింఛన్లు పంచకూడదని, వారి మొబైళ్లు అధికారులకు ఇచ్చేయాలని ఉత్తర్వులు వచ్చాయి. నిమ్మగడ్డ రమేష్ చౌదరి చేసిన ఫిర్యాదు ఫలితమిది. చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఈయన గతంలోనూ ఇలాగే జనాలను ఇబ్బంది పెట్టారు. రిటైర్ అయ్యాక కూడా ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి చంద్రబాబు కోసం పని చేస్తున్నారు. ఇంగ్లిష్ మీడియం పెడతామంటే చంద్రబాబు ఆనాడు కోర్టుకు వెళ్లారు. పేదలకు ఇళ్లు ఇస్తామన్నా ఇలాగే అడ్డుకున్నారు. రాజధాని విషయంలోనూ ఉత్తరాంధ్రకు వెన్నుపోటు పొడిచారు. ఇప్పుడు వలంటీర్లపై విషం చిమ్ముతున్నారు. ఇదే చంద్రబాబు వలంటీర్లను మూటలు మోసేవారంటూ అవమానించారు. పవన్ కల్యాణ్ అయితే వలంటీర్లు ఉమెన్ ట్రాఫికింగ్, చైల్డ్ ట్రాఫికింగ్ చేస్తున్నారని అన్నారు. పేదలకు మేలు చేస్తుంటే వీరు చూడలేకపోతున్నారు. అవ్వాతాతల ఉసురు వీరికి తగిలి తీరుతుంది. మరో రెండు నెలల్లో వీరి దరిద్రం రాష్ట్రానికి వదిలేలా జనం తీర్పునివ్వాలి.

- సీదిరి అప్పలరాజు, మంత్రి

ఇంతకు ఇంత అనుభవిస్తారు



అవ్వాతాతలతో పాటు దివ్యాంగులకు ఇంటికి వెళ్లి పింఛన్లు అందిస్తున్న వలంటీర్లపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం బాధాకరం. అవ్వాతాతలు, దివ్యాంగుల ఉసురు వారికి కచ్చితంగా తగులుతుంది. ఇంతకు ఇంత అనుభవిస్తారు. టీడీపీ నాయకులు తమ బినామీల ద్వారా ఫిర్యాదు చేయించినట్లు ప్రజలందరికీ తెలుసు. వలంటీర్లపై ఉన్న కోపంతో నిస్సహాయులకు కష్టం కలిగిస్తున్నారు. వైఎస్సార్‌సీపీపై ఉన్న భయంతో ఇలా ఫిర్యాదులు చేస్తున్నారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారు. ఎవరు ఇలా ఫిర్యాదు చేయిస్తున్నారో అందరికీ తెలుసు.

- ధర్మాన కృష్ణదాస్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు

చంద్రబాబు కుట్ర



పేదల సంక్షేమాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబు అండ్ టీమ్ కుట్రలు చేస్తోంది. అందులో భాగమే వలంటీర్లపై ఫిర్యాదు. వలంటీర్ల వ్యవస్థ ఈ రోజు దేశానికే ఆదర్శంగా నిలిచింది. అందుకే చంద్రబాబుకు భయం పట్టుకుంది. మొదటి నుంచి వలంటీర్ల వ్యవస్థపై ఆయన విష ప్రచారం చేస్తూనే ఉన్నారు. వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారని ఎంతో మంది వృద్ధులు, దివ్యాంగులు ఎదురు చూస్తుంటారు. వారందరినీ కష్టపెడుతున్నారు. దీనికి చంద్రబాబు ఏం సమాధానం చెబుతారు? జిల్లాలో టీడీపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు, ఎంపీ రామ్మోహన్‌నాయుడు ఎమ్మెల్యే టికెట్లను కోట్ల రూపాయలకు అమ్ముకున్నారని ఆ పార్టీ నాయకులే ఆరోపిస్తున్నారు. అచ్చెన్నాయుడు పోర్టు పేరుతో వేలాది ఎకరాలు దోచుకోవడానికి ప్లాన్ వేశారు. టెక్కలిలో ఆర్టీసీ స్థలాన్ని కొట్టేయడానికి చూశారు. పవర్ ప్లాంట్‌లో ఉద్యోగాల పేరుతో మోసం చేశారు. ఈ ఎన్నికలతో టీడీపీ భూస్థాపితం అవుతుంది.

- దువ్వాడ శ్రీనివాస్, ఎమ్మెల్సీ

ద్రోహం చేస్తున్నారు



నిస్వార్థంగా ప్రజలకు సేవ చేస్తున్న వలంటీర్లపై స్వచ్ఛంద సంస్థ ముసుగులో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడం సిగ్గుచేటు. చంద్రబాబు ప్రయోజనాల కోసం పనిచేసే కొందరు చేసిన కుట్ర ఇది. వలంటీర్లు అంటేనే చంద్రబాబు అండ్ కోకు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. నిస్సహాయులకు సేవలు అందకుండా ద్రోహం చేస్తున్నారు. త్వరలోనే చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెబుతారు. కరోనా వంటి ఆపత్కాలంలో వలంటీర్లే ప్రజలకు సేవలు అందించారు.

- బెల్లాన చంద్రశేఖర్, విజయనగరం ఎంపీ,
గొర్లె కిరణ్‌కుమార్ ఎచ్చెర్ల ఎమ్మెల్యే

నేటి నుంచి టెన్త్ మూల్యాంకనం



శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి జవాబుపత్రాల మూల్యాంకన ప్రక్రియకు రంగం సిద్ధమైంది. ఏప్రిల్ ఒకటి నుంచి 8 రోజులపాటు జరగనున్న ఈ మూల్యాంకనానికి అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాష్ట్రప్రభుత్వ ఆదేశాల మేరకు ఎనిమిది రోజుల్లో స్పాట్‌ను పూర్తిచేసేలా జిల్లా యంత్రాంగం పక్కాగా సన్నద్ధమైంది. తాగునీరు, ఫర్నీచర్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం 7 పేపర్లకు సంబంధించి 1.85 లక్షల జవాబు పేపర్లు జిల్లాకు చేరుకున్నాయి. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలతోపాటు సమీపంలోని మహాలక్ష్మి నగర్‌కాలనీలో ఉన్న శ్రీచైతన్య స్కూల్ ఈ రెండు కేంద్రాల్లో మూల్యాంకన ఈ ప్రక్రియను చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. అందుకు అవసరమైన 1210 మంది వరకు సిబ్బందిని నియమించారు.

విజయవంతం చేయాలి: డీఈఓ

విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలు, కలెక్టర్ సూచనల మేరకు అధికారులు, ఎగ్జామినర్లు, సిబ్బందికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నామని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరావు వెల్లడించారు. స్పాట్‌లో పాల్గొనే సిబ్బంది సమయపాలన పాటించాలని, ఐడీ/గుర్తింపు కార్డుతో హాజరుకావాలని, సెల్‌ఫోన్లకు అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు. ఈ మేరకు ఆదివారం అసిస్టెంట్ కమిషనర్ లియాఖత్ ఆలీఖాన్‌తో కలిసి ఫర్నీచర్‌ను, మరుగుదొడ్లను పరిశీలించారు.



జవాబుపత్రాల దిద్దుబాటులో ఉపాధ్యాయులు

● రూ. 1.20 లక్షల నగదు పట్టివేత



వాహనం తనిఖీ అనంతరం పోలీస్‌స్టేషన్‌లో నగదు లెక్కిస్తున్న అధికారి తిరుపతిరావు

జలుమూరు: బిల్లులు లేకుండా తరలిస్తున్న రూ.1,20,200 నగదును చల్లవానిపేట వద్ద ఆదివారం బొలేరో వాహనం నుంచి స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి తిరుపతిరావు తెలిపారు. పాతపట్నం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా.. తూర్పుగోదావరి జిల్లా కడియం పంచాయతీ కడియం లంక గ్రామానికి చెందిన పెనుబాక నవీన్ వద్ద డబ్బు దొరికిందని, ఆయనపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పురుషోత్తం తెలిపారు. పూల వ్యాపారానికి ఈ డబ్బులు తెచ్చినట్లు వివరించారని, బిల్లునకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది తెలిపారు.

● మద్యం రవాణా కేసులో కారు సీజ్

కంచిలి: కంచిలి జాతీయ రహదారిలో ఫ్లై ఓవర్ పైన ఆదివారం నిర్వహించిన తనిఖీల్లో మారుతీ కారులో 15 మద్యం క్వార్టర్ బాటిళ్లను రవాణా చేస్తుండగా పట్టుకున్నారు. సోంపేట మండలం కొర్లాం గ్రామానికి చెందిన రాజ్‌కుమార్ మొహతా అనే వ్యక్తి మద్యం బాటిళ్లను కారులో తరలిస్తుండగా ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంలో విధులు నిర్వర్తిస్తున్న కవిటి డిప్యూటీ తహసీల్దార్ అల్లాడ జగదీష్‌బాబు పట్టుకుని కారును సీజ్ చేశారు. జగదీష్ బాబు ఫిర్యాదు మేరకు కంచిలి ఎస్‌ఐ జి.రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

● రూ.5.17 లక్షల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగదుతో ఎస్‌ఐ, ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది

సారవకోట: మండల కేంద్రంలో డీటీ సీహెచ్ సుజాత ఆధ్వర్యంలోని ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సిబ్బంది ఆదివారం రూ.5.17 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. అలుదు నుంచి నౌతళ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న సూరన్నాయుడు నుంచి ఈ నగదు స్వాధీనం చేసుకున్నట్లు నరసన్నపేట సీఐ ప్రసాదరావు తెలిపారు. అయితే ఈ నగదుపై సంబంధిత వ్యక్తి పూర్తిస్థాయి ఆధారాలు సమర్పిస్తే నరసన్నపేట రిటర్నింగ్ అధికారి సమక్షంలో వాటిని వారికి తిరిగి అందజేస్తామని ఆయన తెలిపారు.

2024 సమరం సన్నద్ధం

● ఓటు హక్కు కావాలా..?

నరసన్నపేట: ఈ ఎన్నికల్లో ఓటు వేయాలనుకొనే అర్హులకు ఎన్నికల కమిషన్ ఓటు నమోదుకు అవకాశం కల్పించింది. ఓటరుగా నమోదు చేసుకుని.. తుది జాబితాలో పేరు లేకపోయినా ఓటు వేసేందుకు అనర్హులే అవుతారు. ఇలాంటి వారందరి కోసం కేంద్ర ఎన్నికల సంఘం చివరి అవకాశం కల్పించింది. తుది జాబితాలో పేరు లేని వారు, ఏప్రిల్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. ఏప్రిల్ 15వ తేదీలోగా ఓటరుగా దరఖా స్తు చేసుకుంటే సంబంధిత అధికారులు వివరాలను పరిశీలించి అన్ని వివరాలు సక్రమంగా ఉంటే తుది ఓటరు జాబితాలో పేరును చేర్పుతారు. మే నెల 13న జరగనున్న పోలింగ్‌లో ఓటు వేసేందుకు అవకాశం ఇస్తారు.

ఆన్‌లైన్‌లో...

ముందుగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎన్‌వీఎస్‌పీ.ఐన్ వెబ్‌సైట్‌లో మీ ఫోను నంబరుతో రిజిస్టర్ చేసుకొని లాగిన్ అవ్వాలి. ఫారం–6 ను ఫిల్ చేయాలి. న్యూ స్టేటస్ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఆన్‌లైన్ దరఖాస్తులోని వివరాలు ఆధారంగా బూత్ స్థాయి అధికారి మీ అడ్రస్‌కు వచ్చి మీ వివరాలను పరిశీలించి, నిర్ధారించుకున్న తర్వాత ఓటరు జాబితాలో మీ పేరును చేర్పుతారు. అలాగే మొబైల్ ఓటర్ హెల్ప్‌లైన్ యాప్ ద్వారా ఓటు హక్కుకు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఆఫ్‌లైన్‌లో ఇలా..

18 ఏళ్లు నిండి ఓటరుగా మీకు అర్హత ఉంటే ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. బూత్ లెవల్ ఆఫీసర్ (బీఎల్‌ఓ) లకు మీరు నేరుగా ఫారం–6 దరఖాస్తు అందజేయవచ్చు. మండల స్థాయిలో అయితే తహసీల్దార్ కార్యాలయాల్లో కొత్త ఓటరు కోసం పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయవచ్చు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన తర్వాత మాత్రమే మీ పేరును ఓటరు జాబితాలో చేర్చుతారు. ఎలాంటి సందేహాలు ఉన్నా టోల్‌ఫ్రీ నంబర్ 1950కి ఫోను చేసి నివృత్తి చేసుకోవచ్చు.

వడివడిగా వారధి పనులు





● రూ.60.18 కోట్లతో జిల్లాలో ఒక రోడ్డు, 10 వంతెనల ఆధునికీకరణ

అరసవల్లి: జిల్లాలో పది వంతెనల ఆధునికీకరణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇప్పటికే పలు చోట్ల వంతెనల నిర్మాణాలు పూర్తి చేసిన ప్రభుత్వం ఈ పది వంతెనలకు కూడా నిధులు కేటాయించింది. వీటిలో కొన్నింటి పనులు చివరిదశకు చేరుకోగా, మరికొన్ని పనులు జరుగుతూ ఉన్నాయి. ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన (పీఎంజీఎస్వై) పథకం కింద ఆమోదం తెలిపిన మేరకు జిల్లాలో పది వంతెనలు, ఒక రహదారి పనులను పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారుల ఆధ్వర్యంలో చేపట్టారు.

రూ.60.18 కోట్లతో పనులు

జిల్లాలో పీఎంజీఎస్వై పథకం కింద ప్రతిపాదించిన రహదారులు, హైలెవల్ బ్రిడ్జిల నిర్మాణాలకు గాను మొత్తం రూ.60.18 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసి ఆమోదించిన సంగతి విదితమే. ఇందులో రాష్ట్ర వాటా 40 శాతం నిధుల కింద రూ.25 కోట్ల వరకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించి పనులు ప్రారంభించింది. ఈ నిధులతో వజ్రపుకొత్తూరు మండలంలోని ఓ రహదారి నిర్మాణంతో పాటు జిల్లాలో ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ఉన్న పురాతన కాలం వంతెనలను, శిథిలావస్థకు చేరిన బ్రిడ్జిలను కూల్చేసి కొత్తగా వంతెనలను నిర్మిస్తున్నారు. అలాగే మరికొన్ని చోట్ల ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు.

- వజ్రపుకొత్తూరు మండలం డెప్పూరు–బహడపల్లి రహదారి నిర్మాణానికి రూ.1.80 కోట్లు.
- ఎచ్చెర్ల మండలం ఎన్‌హెచ్–16 (పొన్నాడ ఆర్ అండ్‌బీ రోడ్డు) నుంచి దిబ్బలపాలెం రహదారిలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.4.25 కోట్లు.
- ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు నుంచి డొంకూరు మీదుగా పీఎల్ పురం వరకు రహదారిలో 1/230 హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 6.30 కోట్లు.
- ఇచ్ఛాపురం మండలం బూర్జపాడు నుంచి డొంకూరు మీదుగా పిఎల్ పురం వరకు రహదారిలో 0/48 కిలోమీటర్ల మైలురాయి వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.10.50 కోట్లు.
- నందిగాం మండలం ఎన్‌హెచ్–16 నుంచి డిఎల్.పల్లి, సింగుపురం మీదుగా నౌగాం వద్ద ఆర్ అండ్‌బి రహదారిలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.92 కోట్లు.
- నరసన్నపేట మండలం ఉర్లాం–సుందరాపురం ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి తలసముద్రం రహదారిలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.60 కోట్లు.
- రణస్థలం మండలం ఎన్‌హెచ్ -16 నుంచి రావాడ మీదుగా జీరుపాలెం రహదారిలో బూచోడు గెడ్డ మీద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.40 కోట్లు.
- సోంపేట మండలం బారువ నుంచి రట్టి మీదుగా మూలపొలం రహదారిలో కొండరేవుపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.3.45 కోట్లు.
- సోంపేట మండలం బారువ నుంచి రట్టి వెళ్లే రహదారిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.71 కోట్లు.
- సోంపేట మండలం బారువ నుంచి మూలపొలం మీదుగా రట్టి రహదారిలో మహేంద్రతనయ నదిపై బ్రిడ్జి నిర్మాణానికి రూ.14.60 కోట్లు.
- వజ్రపుకొత్తూరు మండలం డెప్పూరు నుంచి బాహడపల్లికి రహదారిలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.5.65 కోట్లు.

రూ.93.94 లక్షలతో కేజీబీవీ అభివృద్ధి పనులు

పాతపట్నం: పాతపట్నం ఆల్‌ఆంధ్ర రోడ్డు సమీపంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో నాడు–నేడు రెండో విడతలో రూ.93.94లక్షలతో 8 అదనపు తరగతి గదులు మంజూరయ్యాయని ఐటీడీఏ డీఈఈ శిమ్మన్న తెలిపారు. ఈ ఏడాది కేజీబీవీలో ఇంటర్ కూడా నిర్వహించడంతో అదనపు తరగతి గదులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. దీంతో ఇటీవల పనులు శరవేగంగా సాగుతున్నారు.



కేజీబీవీలో జరుగుతున్న అదనపు తరగతి గదుల పనులు

● ఘనంగా ఈస్టర్

ఈస్టర్ వేడుకలను జిల్లా కేంద్రంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలు క్రైస్తవ ఆరాధన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. క్రీస్తు పునరుత్థానంపై విశ్వాసకులు ప్రసంగించారు.

- శ్రీకాకుళం కల్చరల్



సహాయమాత ఆలయంలో క్రీస్తును ఆహ్వానిస్తున్న క్రైస్తవులు



క్రైస్తవారాధన మందిరంలో పాల్గొన్న ఆరాధకులు



గీతాలు ఆలపిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

పోక్సో కేసు నమోదు

టెక్కలి రూరల్: తన కుమార్తెను ఓ వ్యక్తి వేధిస్తున్నాడని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టెక్కలి సీఐ పి.పైడయ్య ఆదివారం పోక్సో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. భగవాన్ పురం గ్రామానికి బాలిక టెక్కలి డిగ్రీ కాలేజీ మైదానానికి వచ్చి వెళ్తుండగా టెక్కలికి చెందిన ఇద్దరు యువకులు వేధిస్తుండేవారు. దీనిపై బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ పైడయ్య కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

టెక్కలి రూరల్: మండలంలోని కె.కొత్తూరు గ్రామానికి చెందిన గుంటూరు కుమారస్వామి అనే వ్యక్తి ఆదివారం ఉదయం కత్తితో తన పీక కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. కుమారస్వామికి కొద్ది రోజులుగా ఆరోగ్యం బాగోలేదు. ఇటీవల వైద్యుడిని సంప్రదించగా పచ్చ కామెర్లు సోకిందని, మద్యం తాగకూడదని సూచించారు. అయినా ఆయన మద్యం తాగడంతో భార్య మందలించారు. దీంతో ఆయన మనస్తాపానికి గురై ఇంటిలో ఉన్న కత్తితో పీక కోసుకున్నాడు. వెంటనే అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స చేసి శ్రీకాకుళం రిమ్స్‌కు పంపించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గాయపడిన వ్యక్తి టెక్కలిలో వస్త్ర వ్యాపారం చేస్తుంటారు.

ఓం నమో ఆదిత్యాయ



సూర్యనమస్కారాలు చేయించుకుంటున్న భక్తులు

అరసవల్లి:

ఆదిత్య క్షేత్రంలో ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. మహిళలు ఇంద్రపుష్కరిణి రావిచెట్టు వద్ద ప్రదక్షిణలు చేసి దీపారాధన చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ ఎస్.చంద్రశేఖర్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో భక్తులకు దాహార్తి తీర్చేలా మంచినీళ్ల ప్యాకెట్లను క్యూలైన్ల వద్దనే పంపిణీ చేశారు. వత్సవలస రాజమ్మ తల్లి జాతర సందర్భంగా కూడా భక్తులు ఆదిత్యున్ని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు వివిధ దర్శనాల టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.2,33,900, విరాళాలు, ఆర్జిత సేవల ద్వారా రూ.66,199, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.95 లక్షల వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ చంద్రశేఖర్ తెలిపారు.

● ఉత్సాహపూరితం..

ఎన్నికల ప్రచారాలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. నాయకులు వీధివీధినా పర్యటిస్తూ సామాన్యులను పలకరిస్తున్నారు. వారి యోగక్షేమాలు అడిగి ఎన్నికల్లో గెలిపించాలని అభ్యర్థిస్తున్నారు.



సోంపేట: మాకన్నపురం పంచాయతీలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయకు తిలకం దిద్దుతున్న మహిళ



ఆమదాలవలస రూరల్: సంతకొత్తవలసలో ఎన్నికల ప్రచారం చేస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



కొత్తూరు: పెదరాజపురంలో గిరిజన చిన్నారిని ఎత్తుకొని ముచ్చటిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నిఘా నేత్రానికి దొరికిపోయారు



మాట్లాడుతున్న డీఎస్పీ శృతి, వెనుక నిందితులు

- శ్రీకాకుళంలో బంగారం దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు
- వృద్ధురాలిని మంచానికి కట్టేసి బంగారం దోచుకెళ్లిన దుండగులు
- సాంకేతిక సాయంతో ఇద్దరు దొంగలను పట్టుకున్న పోలీసులు
- 25 తులాల బంగారం రికవరీ

శ్రీకాకుళం క్రైమ్ :

ఐదు నెలల కిందట పథక రచన చేశారు. నెల రోజుల పాటు రెక్కీ చేశారు. అదను చూసి వృద్ధురాలి ఇంటిలోకి జొరబడి ఆమెను కట్టేసి పాతిక తులాల బంగారం దోచుకున్నారు. జిల్లా కేంద్రంలో కలకలం రేపిన ఈ చోరీ కేసును పోలీసులు ఛేదించారు. మార్చి 2న జరిగిన ఈ ఘటనలో నిందితులైన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లాలోని భద్రాచలం గ్రామానికి చెందిన చల్లా జంపన్న, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన పొద్దుటూరి సాంబశివరావులను పోలీసులు అరెస్టు చేసి బంగారాన్ని రికవరీ చేశారు. శ్రీకాకుళం డీఎస్పీ యర్రగుంట శృతి ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. ఆమె తెలిపిన వివరాల మేరకు..

బెట్టింగులతో అప్పులు..

జంపన్న, సాంబశివరావు ఇద్దరికీ క్రికెట్ బెట్టింగ్, పేకాట అలవాటు ఉంది. ఈ అలవాటే వీరిద్దరినీ కలిపింది. మొదట్లో డబ్బులు వచ్చినా క్రమేపీ ఈ వ్యసనం వల్ల ఇద్దరూ అప్పుల్లో కూరుకుపోయారు. శ్రీకాకుళం అరసవల్లి సూర్యనారాయణస్వామిని దర్శించుకుంటే మీ కష్టాలు తీరుతాయని ఓ జ్యోతిష్యుడు చెప్పడంతో ఆరు నెలల కిందట జిల్లాకు వచ్చారు. స్వామిని దర్శించుకుని తిరిగి వెళ్లిపోతుండగా.. బొంతావారి వీధికి చెందిన బమిడిపాటి జగదాంబ ఒంటి నిండా బంగారు నగలతో వీరి కంటికి కనిపించింది. దీంతో ఆ బంగారాన్ని దోచుకునేందుకు వీరిద్దరూ ప్లాన్ వేశారు. మెల్లిగా మాటా మాటా కలిపి కుటుంబ విషయాలు తెలుసుకుని లగేజీ మోసేందుకు సాయపడినట్లుగా నటించి వెంబడించారు. ఆమె కుటుంబం, ఇల్లు, దినచర్య అన్ని వివరాలను తెలుసుకున్నారు.

రెక్కీ చేశారిలా..

బంగారం దోచుకునేందుకు నెల రోజులు రెక్కీ చేశారు. దొంగతనం కనిపించకుండా ఉండేందుకు ఫిబ్రవరి 13 రాత్రి బాధితురాలి పక్కింటిలో ఉన్న సీసీ పుటేజీకి పెయింటింగ్ వేయడం, మళ్లీ ఫిబ్రవరి 27 రాత్రి నల్లరంగు పెయింటింగ్ వేయడం పోలీసులు పుటేజీలో చూశారు. చివరికి మార్చి 2 ఉదయం 11:15 గంటలకు వారు అనుకున్నది సాధించారు. శివ కోవెల పూజారి పెళ్లి కార్డు ఇచ్చారంటూ లోపలికి వెళ్లి చోరీకి పాల్పడ్డారు.

సీసీ పుటేజీలే పట్టించాయి..

బాధితురాలు పోలీసులకు చెప్పిన కోణంలో ఒకటో పట్టణ సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్ దర్యాప్తు ప్రారంభించి సీసీ పుటేజీలన్నీ పరిశీలించారు. బాధితురాలి ఇంటినుంచి 50 మీటర్ల దూరంలో ఉన్న రెవెన్యూ మంత్రి పీఏ ఇంటి సమీప సందులో ఉన్న ఆయుర్వేద, అల్లోపతి షాపులకున్న సీసీ కెమెరాల్లో నిందితులు మాస్కులు తీసేయడంతో స్పష్టంగా కనిపించారు. అక్కడి నుంచి పందుంపుళ్ల కూడలి వద్ద సీసీ కెమెరాలో ఆటో ఎక్కి మున్సిపల్ కార్యాలయం దిగి మార్కెట్‌లో తిరిగి మసీదుకు చేరి అక్కడ నుంచి రిమ్స్‌కు వెళ్లినట్లు నిక్షిప్తమైంది. రిమ్స్ నుంచి మళ్లీ శ్రీకూర్మం వెళ్లి సాయంత్రం ఆమదాలవలస రైల్వేస్టేషన్‌కు చేరి రైలులో పరారైనట్లు పోలీసులు గుర్తించారు. సాంకేతికత సాయంతో ఇద్దరి చిరునామాలను తెలుసుకున్నారు.



నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు బిస్కెట్లు, కత్తి

దొంగిలించిన సొత్తును ఏం చేశారంటే..

దొంగిలించిన బంగారాన్ని వారి గ్రామాల్లో ముత్తూట్ ఫైనాన్స్‌లో తనఖా పెట్టి డబ్బులు తెచ్చుకున్నారు. నగలు వేరే వారి దగ్గర కరిగించేసి రెండు దిమ్మలుగా అచ్చు పోయించి తలో ఒకటి తీసుకుని బయట అమ్మేందుకు ప్రయత్నించారు. వృద్ధురాలి పరిస్థితి తెలుసుకునేందుకు వారు ఆదివారం జిల్లా కేంద్రానికి వచ్చారు. ఉమారుద్రకోటేశ్వరస్వామి ఆలయం వద్ద పార్క్‌లో నిందితులు ఉన్నారన్న సమాచారంతో సీఐ, ఎస్ఐలు తమ బృందంతో మాటువేసి పట్టుకుని అదుపులో తీసుకున్నారు. జంపన్న నుంచి 150 గ్రాములు, సాంబశివరావు నుంచి 141 గ్రాముల బంగారు ముద్దలను, వృద్ధురాలిని బెదిరించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ శృతి సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ గణేష్‌లు చాకచక్యంగా కేసును ఛేదించారని అభినందించడమే కాక సహకరించిన పీసీలు ఎస్ రవికుమార్, పి.సూరిబాబు, సిహెచ్ హరీష్‌కుమార్, డి.తులసిలకు రివార్డులు అందించారు.

కాంట్రాక్ట్ డ్రైవర్‌పై దాడి



గాయాలపాలైన డ్రైవర్ దేవరాజు

మందస: మండలంలోని తాళ్లగురంటి పంచాయతీ గౌడుగురంటి గ్రామానికి చెందిన దేవరాజుపై ఆదివారం ఉదయం దాడి జరిగింది. ఆర్టీసీలో అద్దె ప్రాతిపదికన నడుస్తున్న బస్సులో డ్రైవర్‌గా పని చేస్తున్న దేవరాజు విధులకు వెళ్తుండగా, కళింగదళ్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేశారు. బాధితుడు హరిపురం సామాజిక ఆరోగ్యకేంద్రంలో చికిత్స పొందుతున్నాడు. కొందరు పోలీసులు దాడి చేశారని దేవరాజు మందస పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ విషయమై ఎస్ఐ బి.అనిల్‌కుమార్ ఓ పత్రికా ప్రకటనను విడుదల చేశారు. నాటుసారా అక్రమ రవాణాపై తమకు సమాచారం అందిందని, కానిస్టేబుల్ ఎస్.రవికుమార్, సీపీఓ సంతోష్‌కుమార్, కృష్ణారావు, కేశవరావు కళింగదళ్ రిజర్వాయర్ వద్దకు వెళ్లగా.. డ్రైవర్ దేవరాజు గౌడుగురంటి నుంచి మోటారు సైకిల్‌పై వస్తూ కనిపించారని పేర్కొన్నారు. పోలీసు సిబ్బంది వాహనం ఆపమని చెప్పగా.. ఆపకుండా వెళ్లిపోయారని, అందుకే గొడవ జరిగిందని వివరించారు. ఆ గొడవలో నలుగురు వ్యక్తులు కర్రతో దాడి చేశారని దేవరాజు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామన్నారు. శాఖాపరమైన చర్యలు తీసుకోవడానికి నివేదిక పంపించామన్నారు. పోలీసులు, దేవరాజుకు మధ్య వాగ్వాదంతో జరిగిన సంఘటనే నని, ఎలాంటి రాజకీయ ప్రమేయం లేదన్నారు. ఎవరూ రాజకీయ కోణంలో చూడవద్దని కోరారు.

కూటమిని వ్యతిరేకిస్తూ వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన యువకులకు పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న కృష్ణచైతన్య

పోలాకి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమిని వ్యతిరేకిస్తూ ఆయా పార్టీలకు చెందిన దాదాపు 200 మంది యువకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. నరసన్నపేట పట్టణం, చుట్టు పక్కల గ్రామాలకు చెందిన దాదాపు 200 మంది యువకులు ఆదివారం మబగాంలోని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జోనల్ ఇన్‌చార్జి డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరి మద్దతు తెలిపిన వారికి కృష్ణచైతన్య కృతజ్ఞతలు తెలిపారు. న్యాయబద్ధమైన ఏ అవసరాన్ని తీర్చటానికైనా తాము ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని చెప్పారు. ఇప్పుడు గర్వంగా వైఎస్సార్‌సీపీ జెండా ఒక్కటే పట్టుకుని తిరుగుతామని పార్టీలో చేరిన యువకులు అన్నారు.

చురుగ్గా అమ్మవారి ఆలయ ప్రహరీ నిర్మాణం

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఇలవేల్పు నీలమణి దుర్గ ఆలయంలోని దక్షిణవైపు ప్రహరీ నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. ఈ నెల 16వ తేదీన ఎమ్మెల్యే రెడ్డి శాంతి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే తన సొంత నిధులు రూ.4లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. ప్రహరీ నిర్మాణం పూర్తయితే, దక్షిణవైపు వంట గది, హాల్, మరుగుదొడ్లు ఉంటాయి. ఆలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉంటుందని ఈఓ వాసుదేవరావు తెలిపారు.

శరవేగంగా రన్నింగ్ ట్రాక్ పనులు

శ్రీకాకుళం జిల్లాకే తలమానికంగా నిలిచిన స్థానిక కోడిరామ్మూర్తి స్టేడియంలో రన్నింగ్ ట్రాక్ పనులు శరవేగంగా సాగుతున్నాయి. 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్ పనులు ఇప్పటికే మొదలుకాగా.. దాదాపు తుది దశకు చేరుకుంది. 8 లైన్లతో కూడిన 400 మీటర్ల రన్నింగ్ ట్రాక్‌ను ఏర్పాటుకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వగా అధికారులు పనులు చేపట్టారు. అలాగే 100 మీటర్ల రన్నింగ్ ట్రాక్ ఇందులో భాగంగానే ప్రత్యేకంగా సిద్ధం చేస్తున్నారు. చిప్స్, ఇసుక, మట్టి మూడు లేయర్లతో ట్రాక్‌ను వేస్తున్నారు. ఇప్పటికే మూడు లేయర్లను జేసీపీ, రోలర్‌తో పూర్తిచేశారు. త్వరలో తుది మెరుగులు దిద్ది పూర్తిచేస్తామని జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి, డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు చెబుతున్నారు. – శ్రీకాకుళం న్యూకాలనీ



కోడిరామ్మూర్తి స్టేడియంలో 400మీటర్ల రన్నింగ్ ట్రాక్ పనులు



ఇసుక లేయర్‌తో ట్రాక్



కసరత్తు చేస్తున్న యువకులు



మట్టి లేయర్‌తో ట్రాక్

పన్ను బకాయి వసూళ్లంటూ మోసం


ఇచ్ఛాపురం: పురపాలక సంఘంలో బకాయి పన్నుల వసూలంటూ కొందరు మోసపూరితంగా ఫోన్ చేసి డబ్బులు వసూలు చేస్తున్నారు. బత్తుల నాగరాజు అనే లేడీ ఫ్యాషన్ షాప్ వ్యాపారికి ఓ వ్యక్తి ఫోన్ చేసి పన్ను బకాయి రూ.1050 చెల్లించేందుకు ఈ రోజే చివరిదని చెప్పాడు. అతనికి 9391886913 అనే నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. ఆఫీసుకు వచ్చి చెల్లిస్తానని చెప్పగా తాను ఫీల్డ్‌లో ఉన్నానని 9118698476 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని సూచించాడు. దీంతో ఆ వ్యాపారి అలాగే చెల్లించాడు. అప్పటికి మరో పది నిమిషాల తర్వాత అదే నంబర్ నుంచి మళ్లీ ఫోన్ వచ్చింది. మీకు రూ.570 పెనాల్టీ పడిందని, దాన్ని కూడా చెల్లించాలని చెప్పాడు. అయితే వ్యాపారి తాను కార్యాలయానికి వచ్చి డబ్బులు కడతానని చెప్పడంతో ఫోన్ కట్ చేశాడు. ఈ విషయాన్ని స్థానిక మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ దృష్టికి తీసుకెళ్లగా రాతపూర్వకంగా ఫిర్యాదుచేస్తే పోలీసుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఇలా రెండుకేసులు వచ్చాయని, ఎవరూ ఫోన్‌పే ద్వారా డబ్బులు చెల్లించవద్దని సూచించారు.

సారా తయారీ స్థావరాలపై పోలీసుల దాడులు

మెళియాపుట్టి: మండలంలోని రింపి, మూలరింపి గిరిజన గ్రామాల్లో ఆదివారం పాతపట్నం సీఐ నల్లిసాయి ఆధ్వర్యంలో పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులు సారా తయారీ స్థావరాలపై సంయుక్త దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లపు ఊటలు ధ్వంసం చేశారు. 50 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. ఒక నిందుతుడిని పట్టుకున్నట్లు తెలిపారు. సారాతయారీ చేసిన సామగ్రి సైతం స్వాధీనం చేసుకున్నారు.

1400 లీటర్ల సారా ఊటలు ధ్వంసం

మండలంలోని సవర ముకుందాపురం గ్రామంలోని కొండ ప్రాంతంలో టెక్కలి, పలాస ఎస్ఈబీ పోలీసులు సమష్టిగా దాడులు నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ దాడుల్లో 1400 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలు ధ్వంసం చేసి, 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. సారా తయారీకి వినియోగించిన ప్లాస్టిక్ డ్రమ్ములు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో టెక్కలి ఎస్ఈబీ సీఐ రాజశేఖర నాయుడు, పలాస డీటీఎఫ్ సీఐ కుమార్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.



మెళియాపుట్టి : రింపి గ్రామంలో సారా తయారీ స్థావరంపై దాడులు చేస్తున్న పోలీసులు



స్వాధీనం చేసుకున్న డ్రమ్ములతో సిబ్బంది